

ఈనాడు
కామారెడ్డి



2016లో చివరిసారిగా రాసిన మాన్యువల్ పహాణీలో సర్వేనంబర్ (936/5అ)లో ఎర్రం నీలవ్వ పేరిట ఉన్న 3.04 ఎకరాల భూమి

2024లో ప్రస్తుతం శెట్టి శేఖర్‌రెడ్డి పేరిట మారిన ఇదే సర్వేనంబర్ (936/5అ)లో పట్టా భూమిగా నమోదైన భూమి



కన్నేసి.. కాజేసి

- జంగంపల్లిలో 8 ఎకరాల ప్రభుత్వ భూమికి ఎసరు
- రిజిస్ట్రేషన్ చేసి పట్టాగా మార్చిన వైనం

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

భిక్కనూరు మండలం జంగంపల్లిలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు. నిరుపేదలకు అసైన్డ్ చేసిన వీటిని కాజేసి నిబంధనలకు విరుద్ధంగా పట్టాభూమిగా మార్చేశారు. సర్కారు ఆస్తిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు వంతపాడిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో విధులు నిర్వహించిన ఓ రెవెన్యూ అధికారి రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములకు నిరభ్యంతర పత్రాలు(ఎన్వోసీ) సాధించి బినామీలపై రిజిస్ట్రేషన్ చేయించిన తీరుపై 'ఈనాడు' కథనం.



జంగంపల్లి రెవెన్యూ శివారులో 936/5 అ, 936/6అ, 936/2ఆ, 936/3అ సర్వేనంబర్లలో ఎనిమిది ఎకరాల భూమిని ప్రభుత్వం నిరుపేదలకు అసైన్డ్ చేసింది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటవుతుండడంతో బహిరంగ భూముల విలువ అమాంతం పెరిగింది. ఒకప్పుడు ఎకరం రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు ఉంటే.. ప్రస్తుతం రూ.కోటి నుంచి రూ.కోటిన్నరకు చేరింది. దీంతో జిల్లాలో విధులు నిర్వహించిన ఓ రెవెన్యూ అధికారి ఈ భూములపై కన్నేసి సాగుచేసుకుంటున్న రైతులను మచ్చిక చేసుకున్నాడు. 2016-17లో స్థానిక రెవెన్యూ సిబ్బందికి అమ్యామ్యాలు ముట్టజెప్పి భూదస్త్రాల ప్రక్షాళన సమయంలో (ఎల్ఆర్‌యూపీలో) సదరు అసైన్డ్ భూములను స్థానికంగా ఉన్న ఓ జిల్లాస్థాయి కాంగ్రెస్ నేత, మండలానికి చెందిన మరో చోటానేత పేరిట నమోదు చేయించాడు. తర్వాత తన పలుకుబడి వినియోగించాడు. ఉన్నతాధికారుల సహకారంతో 2022లో నేతల పేర్ల మీద నిరభ్యంతర పత్రాలు సాధించి తహసీల్దార్ కార్యాలయంలో తన బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. ప్రస్తుతం ఆ భూములను చదును చేయించే పని మొదలు పెట్టాడు. ఇటీవల ఓ బడా వ్యాపారవేత్తకు విక్రయించేందుకు యత్నించినా బేరం కుదరక వాయిదా పడింది.

ప్రక్షాళనకు ముందు పహాణీలో అసైన్డ్‌దారుల పేర్లు

భూ దస్త్రాల ప్రక్షాళన చేసే వరకు సదరు భూమి రెవెన్యూ అధికారుల రాతపూర్వక పహాణీల్లో అసైన్డ్‌దారుల పేరిట లావణిపట్టాగా నమోదై ఉంది. తర్వాత జరిగిన లావాదేవీల్లో స్థానిక నేతల పేర్లు, అనంతరం బినామీల పేరిట ప్రభుత్వ భూములు కాస్తా పట్టాభూములుగా మారిపోయాయి. ఇదే సర్వేనంబర్‌లో ఉన్న మిగిలిన భూములు ఇప్పటికీ లావణి పట్టాలుగా, ప్రభుత్వ భూములుగానే ఉన్నాయి.




జంగంపల్లి- తలమడ్ల శివారులో అక్రమంగా పొందిన భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్లు

భిక్కనూరు, కామారెడ్డి మండలాలతో పాటు తాడ్వాయిలో నిరభ్యంతర పత్రాల జారీలోనూ అక్రమాలు జరిగినట్లు సమాచారం. రెవెన్యూ ఉన్నతాధికారులు లోతైన విచారణ చేపడితే వాస్తవాలు బహిర్గతం కానున్నాయి. విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడే అవకాశం ఉంది.


ఉన్నతాధికారులకు నివేదిస్తాం

- రంగనాథ్‌రావు, ఆర్డీవో, కామారెడ్డి

జంగంపల్లి రెవెన్యూ శివారులోని అసైన్డ్ భూములు పట్టాలుగా మారిన విషయం మా దృష్టికి రాలేదు. స్థానికులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.



సర్వేనంబర్ 936/2ఆలో రాజయ్య పేరిట ఉన్న 6 గుంటల భూమి (వృత్తంలో సర్వేనంబర్ మొత్తం సర్కారీ భూమిగా ఎర్ర సిరాతో రాశారు)



ప్రస్తుతం అదే సర్వేలో వీజీఏ కుమార్ పేరిట ఎకరం పట్టా భూమిగా నమోదు చేశారు.

ఎత్తు పెంపుపైనే ఆశలు

పోచారం జలాశయం నీటి నిల్వ సామర్థ్యంపై సర్వేకు కసరత్తు

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, నాగిరెడ్డిపేట

నిజాం రాజుల కాలంలో నిర్మించిన పురాతన జలాశయం(పోచారం) ఎత్తుపెంపు హామీలకే పరిమితమవుతోంది. సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయం అలుగు దుంకినా రెండు పంటలకు సాగునీరందని పరిస్థితి.



రెండేళ్ల కిందట ప్రజాప్రతినిధుల విన్నపం మేరకు అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం, ఎత్తుపెంపు విషయాలపై సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం సర్వేకు జరుగుతున్న కసరత్తుపై కథనం.

ప్రత్యేకంగా నిధులు

జలాశయం ఎగువ ప్రాంతాల్లో వరద కుంటల నిర్మాణాలు లేకపోవడంతో ఏటా పూడిక పేరుకుపోతోంది. రైతులు ప్రాజెక్టు ఎత్తు పెంపు చేపట్టాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో టీఎస్ఈఆర్ఎల్(తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్ రీసెర్చ్ లాబొరేటరీ) యంత్రాంగం ఆధ్వర్యంలో సర్వే చేపట్టాలని నిర్ణయించారు. దీనికోసం నీటిపారుదల శాఖ రూ.6 లక్షలు మంజూరు చేసింది. సాంకేతిక సమస్యలతో నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అనుసంధానంపై కొరవడిన స్పష్టత

ప్యాకేజీ-22లో మంచిప్ప(కొండెం) రిజర్వాయర్ నుంచి యాచారం సొరంగం ద్వారా భూంపల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలను ఎత్తిపోసేలా ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడి నుంచి ఎడమ, కుడి కాల్వలతో పాటు రిడ్జి కాలువలు తవ్వి ఆయకట్టుకు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. మూడు రిజర్వాయర్లు తవ్వి లక్ష ఎకరాలకు నీరందించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. భూంపల్లి రిజర్వాయర్ నుంచి కాటేవాడి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు కాల్వలు తవ్వాలని ప్రతిపాదించారు. గోదావరి జలాలను కాటేవాడి నుంచి గుజ్జుల్‌డ్యాంకు, అక్కడి నుంచి పోచారం జలాశయానికి తరలించవచ్చని జలవనరుల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై స్పష్టత కొరవడింది. దీంతో ప్రాజెక్టు ఎత్తుపెంపుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని సర్వేను త్వరితగతిన పూర్తిచేయించాలని అన్నదాతలు కోరుతున్నారు. నీటి నిల్వసామర్థ్యం, పేరుకుపోయిన పూడిక, ఎత్తుపెంపు సాధ్యాసాధ్యాలపై సర్వేకు టీఎస్ఈఆర్ఎల్‌కు రూ.6 లక్షల నిధులు మంజూరైనట్లు సీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, అధికారులు తదితరులు

వీరనారి ఐలమ్మ పోరాటం.. నేటికీ స్ఫూర్తి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన వీరనారి ఐలమ్మ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, ఆర్డీవో రంగనాథరావు, కమిషనర్ సుజాత, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి చందర్‌నాయక్ తదితరులున్నారు.

పోలీసులపై దాడి ఘటనలో 14 మంది అరెస్టు

కామారెడ్డి నేరవిభాగం : జిల్లాకేంద్రంలో మూడు రోజుల కిందట పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సహా నలుగురు పోలీసులు తీవ్రంగా గాయపడడానికి కారకులైన 14 మందిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. గొడవ జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు, వీడియో రికార్డింగ్, ఇతర సాంకేతికత ఆధారంగా వీరిని గుర్తించినట్లు సమాచారం. జిల్లాకేంద్రంలో కొందరు మాస్కులు ధరించి తిరుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు. దాడుల నేపథ్యంలో కొందరు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చినట్లు వస్తున్న ఆరోపణలపై కూడా పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పంటలకు చీడపీడలు.. నివారణకు సూచనలు

కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే:

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. మాచారెడ్డి, కామారెడ్డి, భిక్కనూరు, రాజంపేట, మద్నూర్, డోంగ్లి, తాడ్వాయి మండలాల్లోని ఆయా గ్రామాల్లోని వరి, పత్తి, ఇతర కూరగాయల పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు సూచించారు.



భిక్కనూరులో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఏమేం చేయాలంటే..



వరి: పంట ప్రస్తుతం పొట్ట దశ నుంచి గింజ పాలుపోసుకునే దశలో ఉంది. వరి పైరులో సుడిదోమ, అగ్గితెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగులు, కంకినల్లి తెగుళ్ల ఆశించాయన్నారు. వరిలో సుడిదోమ నివారణకు డైనోటెఫిర్ 80 గ్రాములు లేదా.. ఫైవ్ మెట్రోజోన్ 120 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పైరుకు పిచికారీ చేయాలన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు అగ్రిమైసిన్ 80 గ్రాముల చొప్పున ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. దీనిని పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. వరిలో ఆకునల్లి, కంకి నల్లి తెగులు నివారణకు ప్రోఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా స్పైరో మెసిఫిన్ ఒక మిల్లీలీటర్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు.



పత్తిలో.. రసం పీల్చే పురుగుల కట్టడికి ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు లేదా ఎసిటమోపిడ్ 0.5 గ్రాములు లేదంటే.. థయోమిథగ్జం 0.5 గ్రాముల మందును లీటర్ నీటికి కలుపుకొని మార్చి.. మార్చి పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. వర్షాలు ఆగిన తర్వాత పత్తిలో 13-0-45 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్క అంతా తడిచేలా పిచికారీ చేయాలి. పత్తి కాయ బఠానీ గింజ పరిమాణానికి రాగానే అధిక దిగుబడి- బరువు పొందడానికి లీటర్ నీటికి 1.5 గ్రాముల బోరాన్‌తో కలిపి ఎకరానికి 300 గ్రాములు పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, మాల్తుమ్మెద డాట్ కేంద్రం నుంచి (ఏరువాక) అనిల్‌రెడ్డి రేవంత్, రుద్రూర్ పరిశోధనా కేంద్రం నుంచి నరేంద్ర, కృష్ణచైతన్య, మేఘలత, దివ్య, రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం నుంచి రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మూడు గేట్లు ఎత్తి.. 21,500 క్యూసెక్కులు వదిలి..

మహ్మద్‌నగర్, నిజాంసాగర్ : నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 16 వేల క్యూసెక్కుల వరద రావడంతో మూడు గేట్లను ఎత్తి 21,500 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేసినట్లు ఏఈఈ శివ ప్రసాద్ తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం నిండుకుండలా మారిందని పేర్కొన్నారు.



జుక్కల్ నుంచి సోపూర్ వెళ్లే దారిలో పత్తి పంట

రాళ్ల నేలలో రత్నాల సాగు

రాళ్ల నేలలోనూ రత్నాలు పండించవచ్చని నిరూపిస్తున్నారు జుక్కల్ మండల రైతులు. పక్కనే కౌలాస్ ప్రాజెక్టు ఉన్నా ఇటువైపు నీరు రాదు. వానాకాలం ప్రారంభానికి ముందే భూములను దుక్కి సాగుకు సిద్ధం చేస్తారు. తొలకరి జల్లులు పడగానే సోయా, కంది, పత్తి విత్తనాలు వేసుకుంటారు. సోయా పంట ఇప్పటికే చేతికి రాగా.. పత్తి, కంది సాగులో ఉన్నాయి. **– ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, జుక్కల్**

అతివలకు ఆర్థిక చేయూత

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

ఆసక్తి ఉన్న రంగాల్లో రుణాల మంజూరు

మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూత అందించేందుకు మహిళా శక్తి పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి బల్దియాల పరిధిలోని మహిళా సమాఖ్య ప్రతినిధులకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పిస్తోంది. ఎంపిక చేసిన సంఘాలకు రుణాలు మంజూరు చేస్తుండగా.. రుణాలు పొందిన మహిళలు యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.



ఇప్పటి వరకు మంజూరు చేసిన యూనిట్ల వివరాలు

బల్దియా	నెలకొల్పిన యూనిట్లు	తీసుకున్న రుణం (రూ.లక్షల్లో)
కామారెడ్డి	25	35
బాన్సువాడ	15	32.50
ఎల్లారెడ్డి	9	11

మొత్తం 20 రకాల వ్యాపారాలు..

సంఘాలకు 9 రకాలు, స్వయంగా ఉపాధి పొందాలనుకునే వారికి 11 రకాల వ్యాపారాల్లో రుణాలు మంజూరు చేస్తారు. వ్యక్తిగత యూనిట్లలో ఉన్నవి.. స్వయం సహాయక ఉత్పత్తులు, ఆహార వాహనాలు, కిరాణా, జనరల్ స్టోర్స్, పండ్ల వ్యాపారం, బేకరీ, పాల ఉత్పత్తులు, మైక్‌సెట్, బ్యూటీ పార్లర్, టెంట్‌హౌజ్, ఫ్యాన్సీ స్టోర్‌లు ఉన్నాయి. సంఘాలకు ఇచ్చేవి క్యాంటీన్లు, మీసేవా కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, వీధి వ్యాపారాలు, క్యాటరింగ్, ఆహార ఉత్పత్తులు, నిర్మాణ సామగ్రి, గృహసేవ, కుట్టు కేంద్రం, డ్రోన్లు వంటి వాటిలో వ్యాపారాలు చేసుకోవచ్చు.



బాన్సువాడలో వ్యాపారాన్ని పరిశీలిస్తున్న మెప్మా పీడీ, ఇతర అధికారులు

ఆసక్తి ఉన్న వారు బల్దియాలో సంప్రదించాలి

మహిళా శక్తి పథకంలో భాగంగా మంజూరు చేస్తున్న యూనిట్లలో వారికి ఆసక్తి ఉన్న రంగాలు ఎంపిక చేసుకుని లబ్ధి పొందవచ్చు. పాలనాధికారి ప్రత్యేక చొరవతో ఆర్థిక చేయూతకు మరింత కృషి చేస్తున్నాం. బల్దియాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఇంకా ఆసక్తి ఉన్న వారు బల్దియాలో సంప్రదించాలి. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తాం. **- శ్రీధర్‌రెడ్డి, జిల్లా మెప్మా పీడీ**

పర్యాటక కేంద్రంగా నిజాంసాగర్ జలాశయం

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రాజెక్టును పరిశీలించారు. గుల్‌గస్తా వద్ద జలవనరుశాఖ ఏఈఈ శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లికార్జున్‌లతో సమావేశం నిర్వహించారు. జలాశయం వద్ద బోటింగ్ , గోల్‌బంగ్లా , గుల్‌గస్తాల సుందరీకరణ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లకు అవసరమైన ప్రణాళికను తయారు చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అనంతరం వరద గేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు అనీస్‌పటేల్, లక్ష్మయ్య, వెంకట్‌రాంరెడ్డి, అజీముద్దీన్, గాండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వరద గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

గాంధారి, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. గురువారం పేట్ సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మదన్‌మోహన్ మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎక్కడి చెత్త అక్కడే ★ కళాశాల ప్రగతికి కదిలిరా! (10లో)

నాణ్యత నివేదికల వెల్లడిలో జాప్యం

అమ్మ ఆదర్శ బడుల బిల్లుల చెల్లింపులో ఇక్కట్లు

కామారెడ్డి పట్టణం-న్యూస్‌టుడే

అమ్మ ఆదర్శ బడుల్లో అంచనా వ్యయం రూ.2 లక్షలకు మించి ఉన్న చోట విజిలెన్స్, నాణ్యతా ప్రమాణాల నివేదిక వెల్లడిలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా పనులు దక్కించుకున్న స్వయంసంఘాల బాధ్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. బిల్లుల చెల్లింపుల సమస్యకు పరిష్కార మార్గం చూపాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషయమై ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యాశాఖ జిల్లా అధికారికి విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది.

జిల్లాలో ఈ విద్యాసంవత్సరం మే నెలలో అమ్మ ఆదర్శ బడుల కింద ఎంపికైన వాటిలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సారి పాఠశాల ఉన్న గ్రామంలోని మహిళా స్వయం సంఘాలకు పనులు అప్పగించారు. మొత్తం 973 బడుల్లో మరమ్మతులు జరిగాయి. అందులో ఇప్పటివరకు 87 బడులకు నిధులు సమకూరాయి. రూ.2 లక్షలకు పైబడి వ్యయంతో కూడిన పనులకు విజిలెన్స్, నాణ్యతా ప్రమాణాల ధ్రువపత్రం అవసరం. ఇలాంటి బడులు 81 ఉండగా.. 14 పాఠశాలలకు సంబంధించి మాత్రమే క్యూసీ విభాగానికి దస్త్రాలు సమర్పించారు.

నిధులు జమ చేయాలి

అక్టోబరు 2వ తేదీ నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. నాలుగైదు రోజుల్లో బిల్లులు చెల్లించేందుకు అధికారులు కసరత్తు చేయాలని పనులు చేపట్టిన నిర్వాహకులు కోరుతున్నారు. ఆయా శాఖల నుంచి నిరభ్యంతర, ఇతర పత్రాలను విద్యాశాఖకు పంపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

- 'రూ.2 లక్షలకు పైబడిన పనులకు సంబంధించి క్యూసీ, నాణ్యతా నియంత్రణ ధ్రువపత్రాలను సత్వరమే సంబంధిత అధికారులు విద్యాశాఖకు పంపాలి. రూ.2 లక్షలకు దిగువన ఉన్న పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలి. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.' అని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు.
- 'పనులు పూర్తయిన వాటికి సంబంధించి ఇంజినీరింగ్ అధికారులను దస్త్రాలను త్వరగా విద్యాశాఖకు పంపాలని ఏఈలకు సూచించాం. ఇటీవల అధికారుల బదిలీల ప్రక్రియ జరగడంతో కొంత ఇబ్బందులు తలెత్తాయి. దస్త్రాలు అపరిష్కృంగా ఉన్నాయి. ఈ సమస్యను సత్వరం పరిష్కార దిశగా చర్యలు చేపడతాం.' అని డీఈవో రాజు అన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

బల్దియాల్లో పట్టని పారిశుద్ధ్యం

పరిశీలన



ఓ వైపు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. మరోవైపు కాలనీల్లో పారిశుద్ధ్యం కొరవడుతోంది. వీధుల్లో పేరుకుపోయిన చెత్త తొలగించడం లేదు. కాలనీలకు వాహనాలు రాకపోవడంతో రోజుల తరబడి ఇంట్లో వ్యర్థాలు నిల్వ చేయలేక కొందరు బహిరంగ ప్రదేశాల్లో విసిరేస్తున్నారు. అధికారులు కారణాలు ఎన్ని చెప్పినా పట్టణాలు, నగరాల శోభను చాటేది పరిశుభ్రమైన పరిసరాలే. వాతావరణ మార్పుల్లో ఉష్ణోగ్రతలు, వానలు ఏకకాలంలో దాడి చేస్తుండటంతో అపారిశుద్ధ్యం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ బల్దియాలు ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం 500 మె.ట చెత్త వెలువడుతుందని అంచనా.

కంచెల ఏర్పాటు

నిజామాబాద్ సర్కిల్1లో ఆదర్శనగర్‌లో చెత్త వేస్తున్న ప్రాంతాలు గుర్తించి కంచె ఏర్పాటు చేశారు. ఇక్కడ దయచేసి చెత్తవేయొద్దని ఫ్లెక్సీలు పెట్టారు. - న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

సేకరణలో జాప్యం

బోధన్‌లో కూడళ్లలో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇంటింటి చెత్త సేకరణకు వినియోగించే 14 వాహనాల్లో సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయి. వీటి స్థానంలో పనిచేసే వాటినే అదనపు ట్రిప్పులు తిప్పుతున్నా సేకరణలో జాప్యమవుతోంది. స్థానికులు ఒకరోజు దాటితే కూడళ్ల వద్ద చెత్త డంప్ చేస్తున్నారు. పట్టణంలో నిత్యం ఉత్పత్తయ్యే 34 మె.ట చెత్తలో 32 మె.ట సేకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాహనం ఆలస్యమైతే ఇంట్లో నిల్వ చేయాలని కోరుతున్నట్లు పారిశుద్ధ్య అధికారులు తెలిపారు.

- న్యూస్‌టుడే, బోధన్



మూడు నెలలుగా..

బాన్సువాడ పట్టణం శ్రీరామకాలనీ అయ్యప్ప మందిరం వెనుక మూడు నెలలుగా చెత్త నిల్వలు ఉంటున్నాయని స్థానికులు తెలిపారు. పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లును వివరణ కోరగా ఇప్పటికి పలుమార్లు నిల్వలు తొలగించామని, రోడ్ల మీద వేయొద్దని కోరారు. నిత్యం 12 మె.ట. చెత్త ఉత్పత్తవుతోంది.

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం





బస్టాండు ఆవరణ అపరిశుభ్రం

ఆర్మూర్ పట్టణంలో ఖాళీ స్థలాలు, ఓపెన్ ప్లాట్లతో చెత్త నిల్వలు పేరుకుంటున్నాయి. బస్టాండు ఆవరణలో కొందరు పాలిథిన్ వ్యర్థాలు, చెత్త పారేసి అక్కడే కాల్చేస్తున్నారు. రెండు రోజులకు ఓసారి చెత్తబండి రావడంతో చెత్త స్థానికులు ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. నిత్యం 30 మె.ట. ఉత్పత్తవుతున్నా వాహనాల కొరతతో 25.మె.ట. మాత్రమే సేకరిస్తున్నారు.

- ఆర్మూర్ పట్టణం

ఇక్కడ ఆదర్శం..

నిజామాబాద్ జిల్లాకేంద్రం దుబ్బ ప్రాంతంలో నగరపాలక సంస్థ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పక్కాగా చెత్త సేకరిస్తున్నారు. నిత్యం సర్కిల్-1 నుంచి సుమారు 45 నుంచి 50 మె.ట చెత్త సేకరిస్తున్నారు.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం



రాత్రి వేళల్లో..



నిజామాబాద నగరం ఆదర్శ నగర్ విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం పక్క రోడ్డులో వేసిన చెత్త ఇది. కొందరు వ్యక్తులు రాత్రి, తెల్లవారుజామున రోడ్లపైనే పారబోస్తున్నారు. నిత్యం కనీసం 20 మె.ట వరకు చెత్త రోడ్ల పక్కన పేరుకుపోతోంది. - నిజామాబాద్ నగరం

కూడళ్లు, మురుగుకాల్వల్లో..

కామారెడ్డి పట్టణం అశోక్‌నగర్ సమీపంలో ఆర్టీసీ కాలనీ దుస్థితి ఇది. జిల్లాకేంద్రంలో నిత్యం 80 మె.ట చెత్త ఉత్పత్తి అవుతోంది. 55 నుంచి 60 శాతం డంపింగ్‌యార్డుకు తరలుతోంది. మిగతాది చెత్తను కూడళ్లు, మురుగు కాల్వల్లో పారేస్తున్నారు.



న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

తొలగించడం మరిచారు

భీమ్‌గల్ పట్టణంలో కేసీఆర్‌కాలనీ ఏర్పడి ఏడాదవుతున్నా బల్దియాకు సంబంధించిన చెత్త తరలించే వాహనాలు కాలనీవైపు రాలేదు. బల్దియాలో 7 చెత్త వాహనాలు, 43 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. చెత్త సేకరించకపోవడంతో ప్రజలు ప్రధాన రహదారిపైనే వేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణను వివరణ కోరగా.. 'కేసీఆర్ కాలనీని ఇది వరకు మున్సిపల్ పరిధిలో చేర్చలేదు. కాలనీని మున్సిపల్ పరిధిలోకి వచ్చేలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. సిబ్బంది పంపి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.



- న్యూస్‌టుడే, భీమ్‌గల్

28న జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 28న జిల్లాస్థాయి ఖోఖో పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17, అండర్- 14 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలోని 8 జోనల్ టీంల క్రీడాకారులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 94900 15388 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఫౌంటెయిన్‌లో పాకురు

ఈ ఫౌంటెయిన్ కామారెడ్డి కలెక్టరేట్‌లోనిది. చూపరులకు ఆహ్లాదం పంచడానికి ఏర్పాటు చేయగా.. దీనిలో నీటిని మార్చకపోవడంతో పాకురు పట్టింది. నీరు ఇలాగే ఉండటంతో దోమల ఆవాసంగా మారుతోంది. శుభ్రం చేయకపోవడంతో అడుగుభాగంలో పాకురు పట్టింది. ఆదర్శంగా ఉండాల్సిన పరిపాలన భవనంలో నిర్వహణ గాడి తప్పింది.

– న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్





సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పరిశోధనలపై దృష్టి

భిక్కనూరు, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే పరిశోధనలపై దృష్టి సారించాలని జువాలజీ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త డా.కరుత పాండి సూచించారు. గురువారం తెవివి దక్షిణ ప్రాంగణంలో జువాలజీ విభాగంలో జాతీయ సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. డీఎన్‌ఏ బార్ కోడింగ్, జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాఖల గురించి వివరించారు. జంతుశాస్త్ర విభాగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఉస్మానియా వర్సిటీ జెనిటిక్స్ విభాగం సహాయ ఆచార్యురాలు సంధ్య, జువాలజికల్ సొసైటీ శాస్త్రవేత్త సోమేష్ బెనర్జీ, శివశంకర్, ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్ ప్రసంగించారు. క్విజ్ విజేతలకు బహుమతులు అందించారు. విభాగాధిపతి ప్రసన్నశీల, అధ్యాపకులు సునీల్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెవివిలో సహాయ కేంద్రం

తెవివి క్యాంపస్(డిచ్‌పల్లి గ్రామీణం): ఏబీవీపీ తెలంగాణ వర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశాలు పొందుతున్న విద్యార్థుల కోసం సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ కార్యవర్గ సభ్యులు శివ, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగరాజు, వర్సిటీ కార్యదర్శి అమృత్‌చారి, నాయకులున్నారు.

కళాశాల ప్రగతికి కదిలిరా!

☛ గిరిరాజ్‌లో రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం, సుభాష్‌నగర్

ఓ వ్యాపారవేత్త ఆర్థికసాయంతో ఏర్పాటైన గిరిరాజ్ కళాశాల ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఇక్కడ చదివిన వారు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, పలు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా ఎదిగారు. 68 ఏళ్లలో మినీ యూనివర్సిటీ స్థాయికి చేరి.. మరోసారి న్యాక్ గుర్తింపునకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కళాశాల వృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం కోరుతూ ఈ నెల 28న సమ్మేళనం ఏర్పాటు చేశారు.



కళాశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన పార్కింగ్ షెడ్డు

ఎలా ఏర్పాటైందంటే?

నిజాం పాలన నుంచి విముక్తి పొందాక జిల్లా అభివృద్ధిలో చదువే కీలకపాత్ర పోషిస్తుందని ఇందూరు నేతలు భావించారు. కళాశాల ఏర్పాటుకు హన్మంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి నిధుల కోసం కృషి చేశారు. 1956లో అప్పటి కలెక్టర్ సి.కే. మూర్తి కళాశాల ఏర్పాటుకు రూ.50 వేలు మంజూరు చేయగా.. ప్రముఖ వ్యాపారవేత్త గిరిరాజ్ మల్‌జీ అగర్వాల్ రూ.51 వేలు అందజేశారు. అందుకు కృతజ్ఞతగా దాత గిరిరాజ్ పేరుతో కళాశాలను ప్రారంభించారు.

అలుమ్ని కమిటీ స్థాపన

పూర్వ విద్యార్థుల్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చి కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు 2018 సెప్టెంబరు 15న అలుమ్ని అసోసియేషన్ పేరుతో పూర్వ విద్యార్థుల సంఘం స్థాపించారు. విదేశాల్లోని వారు సైతం చేరేందుకు ఆన్‌లైన్ సేవల్ని విస్తరించారు.

ఇప్పటివరకు చేపట్టిన పనులు

- కళాశాలలో పార్కింగ్ సమస్య ఉండటంతో రూ.2 లక్షలతో షెడ్డు నిర్మించారు.
- ఈ కళాశాలలో చదివి ఇక్కడే అధ్యాపకులుగా సేవలందిస్తున్నవారు విరాళాలు సేకరించి రూ.3 లక్షలతో ప్రాంగణంలో రక్షణ కంచె నిర్మించి మొక్కలు నాటించారు.
- 1975-78, 1978-81 బ్యాచ్‌ల విద్యార్థులు రూ.5.5 లక్షలతో కొత్తగా పార్కింగ్ షెడ్డు నిర్మించారు. మాజీ మంత్రి మండవ ఇటీవల దీనిని ప్రారంభించారు.

విజయవంతం చేయాలి

కళాశాల అభివృద్ధికి శనివారం సమ్మేళనం నిర్వహిస్తున్నామని, 1956 నుంచి 2023 వరకు చదివిన డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, అలుమ్ని కమిటీ సమన్వయకర్త దండు స్వామి కోరారు. వివరాలకు 9440791144 నంబరులో సంప్రదించాలని సూచించారు

విజ్ఞానం వికసించేలా

● 28న సైన్స్ డ్రామా ఫెస్ట్

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

మారుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన కార్యాచరణకు నడుం బిగించాయి. విజ్ఞాన శాస్త్రంలో ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌ఈఆర్టీ సమన్వయంతో ఈ నెల 28న నాటక పోటీలు సౌతరన్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్ట్(ఎస్ఐఎస్‌డీఎఫ్) చేపట్టనున్న నేపథ్యంలో కథనం

ఆసక్తి పెంచేలా.. ప్రపంచ నీటి ఎద్దడి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సమాజం, విపత్తుల నిర్వహణకు ఆధునిక సాంకేతికత, ఆరోగ్యం పరిశుభ్రత, వాతావరణ మార్పు, దాని ప్రభావం అనే ఐదు అంశాల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకుని దానిపై నాటకం ప్రదర్శించాలి. దీనికి 100 మార్కులు కేటాయించారు. ప్రదర్శనకు 50, సాంకేతికతకు 30, ఉత్తమ ప్రదర్శన తీరునకు 20 ఇవ్వనున్నారు. 30 నిమిషాల్లో డ్రామాను పూర్తి చేయాలి. ప్రదర్శించే బృందంలో ఒక డైరెక్టర్, స్క్రిప్ట్ రచయితతో పాటు 10 మంది మించకూడదు. ఈ నెల 28న కామారెడ్డి జిల్లాకేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారితో డీఈవో, జిల్లా సైన్స్ అధికారి(పాత చిత్రం)

సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

జిల్లాలోని ప్రతి పాఠశాలలోని 8 నుంచి 10వ తరగతిలోని ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సిద్ధం చేయాలి. శాస్త్ర సాంకేతికతలను డ్రామా రూపంలో ప్రదర్శించాలి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైతం మంచి గుర్తింపు ఉంటుంది.. సద్వినియోగం చేసుకోవాలి.

అనుమానితులు కనిపిస్తే తెలపండి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో మూడు రోజుల క్రితం జరిగిన గొడవతో అలజడి రేగింది. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పోలీసు మాట వినాలని ఏఎస్పీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డీఎస్పీ కార్యాలయ ఆవరణలో డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కామారెడ్డి గ్రామీణ సీఐ రామన్‌తో కలిసి గురువారం వివిధ సామాజిక వర్గాల పెద్దలతో నిర్వహించిన శాంతి చర్చల్లో ఏఎస్పీ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, ఎవరి ఆత్మాభిమానం దెబ్బతినకుండా నడుచుకోవాలన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాలపై వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం. . కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన మహిళకు ఐదేళ్ల కిందట బాన్సువాడకు చెందిన వ్యక్తితో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా భర్త వేధింపులకు పాల్పడుతున్నాడని, వేధింపులు తాలలేక వివాహిత తండ్రికి చరవాణిలో సంప్రదించి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. తండ్రి వెంటనే బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు సాంకేతికత ఆధారంగా ఆమె నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రైల్వే ఠాణా ఎస్సై సాయిరెడ్డికి సమాచారం అందించారు. ఎస్సై సిబ్బందితో కలిసి వెళ్లి వివాహితను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారిణులు

నిజామాబాద్ క్రీడావిభాగం: నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గురువారం బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించే టోర్నీలో పాల్గొంటారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా నెట్‌బాల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రవి, పీడీ రాము, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.



నేడు మిట్టపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో..

నిజామాబాద్ క్రీడావిభాగం: మిట్టపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో నిజామాబాద్ పాఠశాలలో శుక్రవారం నెట్‌బాల్ లీగ్, నాక్ ఔట్ టోర్నీ నిర్వహించనున్నామని సంఘం కార్యదర్శి జిల్లా రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికల జట్లు పాల్గొంటాయని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 94400 07004, 6281705645 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన క్రీడాకారుడు గణేశ్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు నిజామాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించే సబ్‌జూనియర్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

28న ఫుట్‌బాల్, రెజ్లింగ్..

నిజామాబాద్ క్రీడావిభాగం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 28న బాలబాలికలకు రాజారాం స్టేడియంలో అండర్-17 ఫుట్‌బాల్, జడ్పీహెచ్‌ఎస్(మంచిప్ప)లో అండర్-14, 17 రెజ్లింగ్ ఎంపిక పోటీలు చేపడుతున్నట్లు కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఇందులో పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు 7893732228, 9550358444 నంబర్లలో సంప్రదించాలన్నారు.

30న విలువిద్య, స్కేటింగ్

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలబాలికలకు ఈ నెల 30న నగరంలోని రాజారాం స్టేడియంలో అండర్-14, 17 విలువిద్య, డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో అండర్-11, 14, 17 స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు చరవాణి నెంబర్లు 70369 15136, 83339 47957లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముగిసిన పోటీలు

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: ఏడేళ్ల తర్వాత నిర్వహించిన జక్రాన్‌పల్లి మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. జక్రాన్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సాయంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించారు. గెలిచిన జట్లకు షీల్డులు, ట్రోఫీలు ప్రదానం చేశారు. అనంతరం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు.

ఉమ్మడి జిల్లా యోగా సాధకులకు..

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి యోగా భవన్‌లో గురువారం ఉమ్మడి జిల్లాకు సంబంధించి క్రీడాకారుల యోగా ఎంపికలు పూర్తయ్యాయి. అండర్-17 బాలుర విభాగంలో సందీప్(కామారెడ్డి), తరుణ్(నిజామాబాద్), వీరుపక్ష్(నిజామాబాద్) విజయం సాధించారు. బాలికల నుంచి సోనా(కామారెడ్డి), సరస్వతి(కామారెడ్డి), త్రివేణి(నిజామాబాద్) గెలుపొందారు. అండర్-14 బాలుర విభాగం నుంచి సాయిచరణ్(నిజామాబాద్), హర్షవర్ధన్(కామారెడ్డి), సృజన్(నిజామాబాద్) ఎంపికయ్యారు. బాలికల నుంచి సింధూజ(కామారెడ్డి), జ్యోత్స్న(కామారెడ్డి), సుమైత్రికా(నిజామాబాద్) విజయం సాధించారు. డీఈవో రాజు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ హీరాలాల్ పాల్గొన్నారు.

కౌలాస్ కోట మార్గం పరిశీలన

జుక్కల్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెండ్రోజుల్లో కౌలాస్‌కు రానున్న నేపథ్యంలో ముందస్తుగా జిల్లా అధికారులు గురువారం కోటను సందర్శించారు. ఈజీఎస్ పీడీ సురేందర్ కోటకు వెళ్లే దారి స్థితిగతులపై ఆరా తీశారు. కౌలాస్ గ్రామం వెనుక ఉన్న వాగు పారడంతో గతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు (మట్టి) కొట్టుకుపోయి రింగులు మిగిలాయి. నిజాంసాగర్ జలాశయానికి వరద ఉండడంతో నీటిని మంజీరాలోకి విడుదల చేస్తున్నారు. కోటకు వెళ్లాలంటే ఈ వాగు దాటాల్సిందే. వాగు దాటలేని పరిస్థితి ఉండటంతో అధికారులు వెనక్కి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. తాత్కాలిక దారి ఏర్పాటు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వెంట ఎంపీవో రాము, నరేశ్, అశోక్, తదితరులు ఉన్నారు.



కోట నుంచి వెనక్కి వస్తున్న ఈజీఎస్ పీడీ సురేందర్, తదితరులు

విద్యార్థిని చరవాణికి సందేశం..

☛ ఉపాధ్యాయుడిపై చేయిచేసుకున్న తల్లిదండ్రులు

మోపాల్: విద్యార్థిని తండ్రి చరవాణికి ఉపాధ్యాయుడు సందేశాలు పంపడం వివాదానికి దారి తీసింది. ఈ ఘటన మోపాల్ మండలంలో చోటుచేసుకుంది. ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థినికి చెప్పాల్సిన విషయం రాత్రివేళ ఆమె తండ్రి చరవాణికి పంపారు. దీనిపై అభ్యంతరం తెలుపుతూ.. తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం ప్రధానోపాధ్యాయురాలికి ఫిర్యాదు చేశారు. సెలవులో ఉన్న సదరు ఉపాధ్యాయుడు గురువారం విధులకు రావడంతో విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి ఆయనపై చేయిచేసుకున్నారు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను ఠాణాకు పిలిపించగా.. వారు రాజీ కుదుర్చుకొని ఫిర్యాదు ఇవ్వకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. సదరు ఉపాధ్యాయుడికి ప్రధానోపాధ్యాయురాలు మెమో ఇచ్చినట్లు తెలిసింది.

కళ్లలో కారం చల్లి.. కర్రలతో దాడి..

● పక్కా ప్రణాళికతో దారుణ హత్య

మోపాల్, న్యూస్‌టుడే: తన కూతురు బలవన్మరణాన్ని జీర్ణించుకోలేని తండ్రి ఆమె అత్తగారి కుటుంబంపై కక్ష పెంచుకున్నారు. పక్కా ప్రణాళికతో బుధవారం రాత్రి ఇంటిపై దాడి చేసి గాజ నరహరి(58) కళ్లలో కారంపొడి చల్లి కర్రలతో కొట్టి హతమార్చిన ఘటన మోపాల్ మండలం కంజరలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. బోయిని సత్యనారాయణ కుమార్తె వర్షను అదే గ్రామానికి చెందిన నరహరి చిన్న కొడుకు గోవర్ధన్‌కు వచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మూడు నెలల క్రితం వర్ష పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో భర్త గోవర్ధన్ 40 రోజులు జైలుకెళ్లి ఇటీవలే బయటకు వచ్చారు. వర్ష తండ్రి సత్యనారాయణ తన కుమార్తె పిల్లల పేరుపై ఆస్తులు రాయాలని పంచాయితీ పెట్టించారు. దీనిపై ఇరు కుటుంబాలకు ఒప్పందం కుదరకపోవడంతో బుధవారం రాత్రి నరహరి కుటుంబంపై దాడి చేశారు. రక్షించేందుకు అడ్డుగా వెళ్లిన ఆయన భార్య స్వరూప, పెద్ద కొడుకు గోపి(32)ని గాయపరిచారు. భార్య, కుమారుడు ఇంట్లోకెళ్లి గడియ పెట్టుకొని డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లేలోపే నిందితులు పారిపోయారు. ఆ సమయంలో గోవర్ధన్ లేకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. బుధవారం రాత్రి ఘటనా స్థలానికి చేరుకున్న ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ గొడవను అదుపుచేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు బోయిని సత్యనారాయణ, లలిత, పూజిత, బాలకృష్ణ, వంశీ, సందీప్, మహేష్, రవితో పాటు మరి కొందరిపై కేసు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



గాజ నరహరి

పోలీసుల కస్టడీలో 8 మంది: నరహరిని చంపిన వారిని అరెస్టు చేసే వరకు అంత్యక్రియలు నిర్వహించమని మృతుడి కుటుంబీకులు భీష్మించడంతో ఏసీపీ, సీఐ బాధితులతో మాట్లాడి సముదాయించారు. 8 మంది కస్టడీలో ఉన్నారని చెప్పడంతో గురువారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



●●● పట్టణంలోని కొయ్య గుట్టలో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో నిండిపోయాయి. **-రాములు, స్థానికుడు**

●●● సమస్యను పారిశుధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో పనులు చేయించారు.

●●● జిల్లాకేంద్రంలోని 19వ వార్డులో మురుగు కాల్వ పేరుకుపోయింది. **- రవి, స్థానికుడు**

●●● సిబ్బందితో కాల్వ శుభ్రం చేయించాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో దోమల బెడద తీవ్రంగా ఉంది. **- అంజయ్య, స్థానికుడు**



●●● మురుగు కాల్వలో రసాయనాల పిచికారీ చేస్తాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● దోమకొండలో కుక్కల బెడదను నివారించాలి. **- శ్రీనివాస్, దోమకొండ**

●●● సమస్యను పశువైద్యాధికారులకు తెలియజేస్తాం. **- రమేశ్, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, దోమకొండ**

●●● మాచారెడ్డి ఠాణా పరిధిలో కొద్ది రోజులుగా ఉద్యోగాలకు సంబంధించి పీసీసీ ధ్రువపత్రాలు జారీ చేయడం లేదు. అధికారులు త్వరగా ఆమోదించాలి. **-బాధితులు, మాచారెడ్డి**

●●● ధ్రువపత్రాల జారీ విషయంలో డిజిటల్ సంతకం అవసరం. ఈ సంతకం సాంకేతిక సమస్యలతో ఆమోదం కావడం లేదు. పరిష్కారం కాగానే జారీ చేస్తాం. **- అనిల్, మాచారెడ్డి ఎస్సై**

●●● మురుగు కాల్వ వెంట గడ్డి పెరిగింది. **- రమేష్, అన్నారం తండా**

●●● సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. **- రాంనివాస్, అన్నారం తండా కార్యదర్శి**

●●● రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట 11కేవీ విద్యుత్తు లైను ప్రమాదకరంగా ఉంది. **సురేష్, గ్రామస్థుడు.**

●●● విద్యుత్తు లైనును పక్కకు మార్చేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేయిస్తాం. **లక్ష్మీనరసింహా, ఏఈ.**

●●● బస్వాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ర్యాంపు నిర్మించాలి. **- విజయ్, గ్రామస్థుడు**

●●● ర్యాంపు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకొంటాం. అక్కడే కంకర, సిమెంట్ ఉంది. **- శ్రీనివాస్, ఎంపీడీవో, జుక్కల్**

●●● గాంధారి-బాన్సువాడ రహదారి పక్కన తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది.

●●● ఎత్తులో అమర్చి చుట్టూ కంచె ఏర్పాటు చేయిస్తాం **- సతీష్‌రెడ్డి, ఏఈ**

●●● బిచ్కుందలోని రాంసాయి మందిరం వద్ద మురుగు కాల్వపై మూత లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **సచిన్, బిచ్కుంద**

●●● పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటాం. **శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, బిచ్కుంద**

●●● బుర్నాపూర్ రోడ్డులో ఉన్న బోరు మోటారు పైపులైను తరచూ లీకేజీ ఏర్పడుతోంది. **గౌస్, స్థానికుడు**

●●● మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, చిన్నకొడప్‌గల్.**

●●● బీసీ కాలనీలో మురుగు కాల్వలు లేక వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది **- నిమ్మల సంజీవరెడ్డి, తాడ్వాయి**

●●● బీసీ కాలనీలో మురుగు కాల్వలు లేవు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వాటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- సాజిద్ అలీ, గ్రామ పంచాయతీ అధికారి, ఎంపీడీవో, తాడ్వాయి

●●● మండలంలోని ధర్మపురితండాలో మురుగు కాలువలు వ్యర్థాలతో నిండి కంపు కొడ్తున్నాయి. **శ్రీలాల్, ధర్మపురి తండా**

●●● రెండు రోజుల్లో వ్యర్థాలు తొలగిస్తాం. **భానుచందర్, కార్యదర్శి**

●●● తాండూరు గ్రామ పంచాయతీ ప్రధాన రహదారిపై గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. **రాజశేఖర్, తాండూరు**

●●● గుంతలో కంకర పొడి వేసి పూడ్చి వేయిస్తా. **రాజేశ్వర్, ప్రత్యేకాధికారి**

- న్యూస్‌టుడే,బాన్సువాడ పట్టణం, కామారెడ్డి పట్టణం, రాజంపేట, మాచారెడ్డి, దోమకొండ రామారెడ్డి,బిచ్కుంద, గాంధారి, జుక్కల్, నాగిరెడ్డిపేట్,పెద్దకొడప్‌గల్, తాడ్వాయి,పిట్లం

పల్లె దారులతో పరేషాన్

● రాకపోకలకు పాట్లు
● మరమ్మతులపై మీనమేషాలు

న్యూస్‌టుడే, నాగిరెడ్డిపేట

గ్రామాల ప్రగతిలో రహదారుల పాత్ర కీలకం. ఏళ్ల తరబడి మరమ్మతులు లేక అవి అధ్వానంగా మారాయి. రాకపోకల సమయంలో ప్రజలు, చోదకులు నానా పాట్లు పడుతున్నారు. వాహనాలు మూణ్నాళ్లకే షెడ్డులకు వెళుతున్నాయి. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇక వర్షాకాలంలో పరిస్థితి దేవుడికే ఎరుక. బురద మార్గాల్లో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి.



గుంతలతో రాఘవపల్లి రహదారి



లింగంపల్లి వద్ద కంకరమయంగా..



బొల్లారం రోడ్డు దుస్థితి

ఈ మార్గాల్లో..

నాగిరెడ్డిపేట్ మండలంలోని రాఘవపల్లి, గోపాల్‌పేట్-ఎల్లారెడ్డి, వెంకంపల్లి, తాండూరు, లింగంపల్లి, బొల్లారం, జప్తి జాన్కంపల్లి మార్గాలు గజానికో గుంత... అడుగుకో గొయ్యి చందాన మారాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం : గిరిధర్, పీఆర్ డీఈ

మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా మారిన మాట నిజమే. నూతన రహదారుల నిర్మాణానికి నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతాం. నిధులు మంజూరు కాగానే కొత్త రహదారులు నిర్మిస్తాం.

ట్రాక్టర్‌పై ప్రయాణించి ... సమస్యలు తెలుసుకొని...

డోంగ్లీ(మద్నూర్), న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో సమస్యను తెలుసుకొనేందుకు ఆ మహిళా తహసీల్దార్ ట్రాక్టర్ ఎక్కి అయిదు కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. డోంగ్లీ మండలం సిర్పూర్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ స్వ గ్రామం. అక్కడ అనేక సమస్యలు ఉన్నాయని, ఆలయ భూములు కొందరు కబ్జా చేశారని ఇటీవల స్థానికులు కలెక్టర్ సాంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. పాలనాధికారి ఆదేశాలతో తహసీల్దార్ రేణుక గురువారం గ్రామానికి వెళ్లారు. ఆలయ భూమి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉందని స్థానికులు చెప్పారు. అక్కడికి వెళ్లాలంటే రోడ్డు లేదు..వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. చేసేదేమి లేక రెవెన్యూ సిబ్బంది, కొందరు గ్రామస్థులతో కలిసి ట్రాక్టర్‌పై ముళ్ల కంపలు, వాగు దాటుకుంటూ వెళ్లారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని తహసీల్దారు చెప్పారు.



సిర్పూర్ వాగులో ట్రాక్టర్‌పై వెళ్తున్న తహసీల్దార్ రేణుక చౌహాన్

బీర్కూర్ మహాజన సభ రసాభాస

బీర్కూర్, న్యూస్‌టుడే: బీర్కూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ ఛైర్మన్ గాంధీ అధ్యక్షతన గురువారం నిర్వహించిన విండో మహాజన సభ రసాభాసకు దారితీసింది. ప్రతి సభలో సొసైటీ జమ, ఖర్చుల లెక్కలను కార్యదర్శి సరిగ్గా చెప్పడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో తరుగు పేరిట దోపిడీ చేయడంతో నష్టపోతున్నామని అన్నదాతలు సొసైటి సిబ్బందిని నిలదీశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విండో కార్యదర్శి విఠల్‌ను బదిలీ చేయాలని తీర్మానించారు. ఛైర్మన్ గాంధీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: దుర్కి సొసైటీ కార్యాలయంలో విండో అధ్యక్షుడు దివిటి శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సొసైటీ మహాజన సభలో రుణమాఫీ కాని రైతులు సహకార సిబ్బందిని నిలదీశారు. అనంతరం అర్హులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని తీర్మానించారు. విండో వైస్ ఛైర్మన్ అరుణ్ తదితరులు ఉన్నారు.



సొసైటీ కార్యదర్శి, ఛైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

30లోగా సీఎంఆర్ ఇవ్వకుంటే కఠిన చర్యలు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైస్‌మిల్లర్లు ఈ నెల 30వ తేదీలోగా సీఎంఆర్ ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో గురువారం పౌరసరఫరాలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. నిర్ణీత గడువులోగా బియ్యం సరఫరా చేయకుంటే అపరాధ రుసుముతో పాటు వచ్చే వానాకాలం ధాన్యం కేటాయింపులు నిలిపివేస్తామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, ఏసీఎస్‌వో నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని కాంప్లెక్స్ నోడల్ అధికారి గంగాకిషన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని దేవునిపల్లి ప్రభుత్వ బడిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు రోల్‌ప్లే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవునిపల్లి ప్రభుత్వ బడి(ప్రథమ), అడ్లూర్ జడ్పీ బడి(ద్వితీయ), నిజాంసాగర్ ఆదర్శ బడి(తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. వీరితో పాటు పోటీల్లో పాల్గొన్నవారందరికీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్త వేణుగోపాల్, న్యాయనిర్ణేతలు సునీత, విష్ణువర్ధన్, శ్రీనివాస్‌లున్నారు.



విజేతలతో గంగాకిషన్ తదితరులు



కామారెడ్డిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



దోమకొండలో..



తెవివి దక్షిణ ప్రాంగణంలో..



జిల్లా పోలీసు కార్యాలయంలో.. ఎస్పీ సింధూశర్మ

చాకలి ఐలమ్మ జయంతి

జిల్లావ్యాప్తంగా చాకలి ఐలమ్మ జయంతిని గురువారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కామారెడ్డి గ్రామీణం మండలంలోని ఇస్రోజివాడిలో చాకలి ఐలమ్మ విగ్రహన్ని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, రజక సంఘం, బీసీ సంక్షేమ సంఘం, బీసీ విద్యార్థి సంఘం, వివిధ పార్టీల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. **న్యూస్‌టుడే, బృందం**



కామారెడ్డి: పురపాలక కార్యాలయంలో.. ఛైర్‌పర్సన్ ఇందుప్రియ



పిట్లంలో ..



బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, గంగాధర్



జిల్లాకేంద్రంలో భారాస ఆధ్వర్యంలో



ఎల్లారెడ్డిలో



మద్నూర్‌లో...



బిచ్కుందలో...



ఆదాయ వ్యయాలను రైతులకు వివరిస్తున్న సీఈవో సాయిప్రకాష్

బినామీ పేరుతో రుణం

ఈనాడు , కామారెడ్డి : బిచ్కుంద మండలంలోని పుల్కల్ సహకార సంఘంలో గురువారం మహా జన సభ నిర్వహించారు. ఓ ప్రజాప్రతినిధికి చెందిన సమీప బంధువుకు పుల్కల్ సహకార సంఘంలో రూ.22లక్షల రుణం ఇవ్వడంతో రైతులు సొసైటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందికి రూ. 50వేల రుణ పరిమితి ఉండగా...ఒకరు రూ. 2.50లక్షలు తీసుకోవడంతో ఆయనను నిలదీశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదింటి ఆడపడుచులకు ఓ వరం

గాంధారి, న్యూస్‌టుడే: పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి పథకం ఓ వరం అని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం సాయంత్రం 94 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ సతీష్‌రెడ్డి, డీటీ రవీందర్, ఆర్ఐ ప్రదీప్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు,

మహిళలకు ఆర్థిక చేయూత

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: మహిళలకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పుర పాలక కార్యాలయంలో గురువారం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను రాష్ట్ర ఆగ్రో ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. పోచారం మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, మెప్మా జిల్లా పీడీ శ్రీధర్‌రెడ్డి, పురకమిషనర్ శ్రీహరి రాజు, కత్తెర గంగాధర్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా

ఆలయాభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని కోడూరు హనుమాన్ ఆలయ అభివృద్ధికి నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. గురువారం ఆలయానికి వచ్చిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ప్రతినిధులు ఉదయ్, నర్సింలు, మల్లేశ్, రమేశ్, సురేశ్ తదితరులున్నారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్స్ సమస్యలను కేంద్రం వెంటనే పరిష్కరించాలని సంఘం కామారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి రాజన్న అన్నారు. ముంబయిలో గురువారం జరిగిన సీనియర్ సిటిజన్స్ సమావేశానికి కామారెడ్డి నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. రైల్వే ఛార్జీల్లో వయోవృద్ధులకు రాయితీ కల్పించాలన్నారు. ప్రతినిధి విశ్వనాథం తదితరులున్నారు.

మాజీ ఎంపీపీ అశోక్ మృతి

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద మండల మాజీ ఎంపీపీ అశోక్ గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయం ఆరు గంటల సమయంలో గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను బాన్సువాడ ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాజీ ఎంపీపీ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లాలో పలువురు కార్యదర్శులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ స్థానిక కారదర్శులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యదర్శులు రవి, సౌందర్య, సవిత ఉన్నారు.



చెక్కు అందజేత

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కోనాపూర్ గ్రామానికి చెందిన బి.నారాయణ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు ఏనుగు రవీందర్ రూ.2.50 లక్షల చెక్కును మంజూరు చేయించి గురువారం బాధితుడికి చెక్కు అందజేశారు.

రూ.4 లక్షల గుట్కా పట్టివేత

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద నుంచి బోధన్‌కు తరలిస్తున్న రూ.4 లక్షల విలువ గల గుట్కాను పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. కర్ణాటకలోని ఔరద్ నుంచి బిచ్కుంద మీదుగా బోధన్‌కు గుట్కా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గోపన్‌పల్లి శివారులో ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో నిషేధిత గుట్కాకు సంబంధించిన సంచులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బిచ్కుంద: ఆటోను స్వాధీనం చేసుకున్న పోలీసులు

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: భర్తను హత్య చేసిన కేసులో భార్య తడకంటి అంజవ్వకు జీవిత ఖైదును విధిస్తూ జిల్లా న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ గురువారం తీర్పును వెలువరించారు. జిల్లా ఎస్పీ సింధూశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడపగల్ మండలం కాస్లాపూర్‌కు చెందిన తడకంటి సాయిలు మద్యం మత్తులో ఉన్న సమయంలో.. అతడి భార్య అంజవ్వ దోతితో గొంతు బిగించి 2022 జూన్ 10వ తేదీన రాత్రి హత్య చేసింది. సాక్ష్యాధారాల ఆధారంగా నేరం రుజువు అవడంతో న్యాయమూర్తి జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. అంజవ్వ రూ.2 వేల జరిమానాను చెల్లించాలని ఆదేశించారు. నిందితురాలికి శిక్ష పడేలా పనిచేసిన పోలీసు అధికారులను, పీపీలను, కోర్టు లైజనింగ్ అధికారి మురళి తదితరులను ఎస్పీ అభినందించారు.

పోక్సో కేసులో నిందితుడికి..

కామారెడ్డి నేరవిభాగం: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన మరిపల్లి బాలకృష్ణ అలియాస్ బాలరాజ్ అనే వ్యక్తికి పోక్సో కేసులో జీవిత ఖైదును విధిస్తూ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ తీర్పును వెలువరించారు. ఎస్పీ సింధూశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం శివారులోని రామేశ్వర్‌పల్లిలో 2023 మార్చి 8న ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారికి మాయమాటలు చెప్పిన మరిపల్లి బాలకృష్ణ అలియాస్ బాలరాజ్ తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అనంతరం బాలికకు కల్లు తాగించి బలాత్కారం చేశాడు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడు రూ.10 వేల జరిమానాను చెల్లించాలని ఆదేశించారు. బాలిక భవిష్యత్ అవసరాల నిమిత్తం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా రూ.7 లక్షలు అందజేయాలని సూచించారు.


ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

బాన్సువాడ, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తబాదికి చెందిన ఉపాధ్యాయురాలు మూడ్ ప్రమీల(38) గురువారం ఇంట్లో ఉరేసుకుని మృతి చెందినట్లు బాన్సువాడ సీఐ మండల అశోక్ తెలిపారు. ప్రమీల అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈమె కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. తీవ్రత ఎక్కువ కావడంతో పాఠశాలకు కొన్ని రోజుల నుంచి సెలవులో ఉన్నారు. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త రవీందర్ సైతం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలం హస్గుల్ గ్రామ శివారులో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. మృతుడిని బిహార్‌కు చెందిన మనీష్(17)గా గుర్తించారు. గత కొన్ని రోజులుగా హస్గుల్‌కు చెందిన ప్రవీణ్ పశువుల పాకలో అతను పనిచేస్తున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



అహ్మదుల్లా

మైదుకూరు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ జిల్లా మైదుకూరు పట్టణానికి సమీపంలోని 40వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన సయ్యద్ అహ్మదుల్లా (39) మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై కడప వైపునకు వెళ్తున్న అహ్మదుల్లా ముందు వెళ్తున్న రోడ్డు రోలర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ...

బిచ్కుంద: బిచ్కుంద మండల కేంద్రంలో గురువారం రాత్రి లారీ ఢీ కొని యువకుడు మృతి చెందాడు. కింది గల్లి నుంచి బస్టాండ్‌కు వెళ్తున్న గణేష్ (21) గుంతను తప్పించబోయి బాన్సువాడ నుంచి బిచ్కుంద వస్తున్న లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరులో మానసిక స్థితి సరిగ్గా లేని వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన బత్తుల బాలవ్వ ఈ నెల 23న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని కొడుకు సాయిలు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

బీర్కూర్: దామరంచ శివారులోని మంజీర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి పట్టుకుని, రూ.2500 జరిమానా విధించినట్లు తహసీల్దార్ లత గురువారం తెలిపారు.

భూవివాదంపై ఇరువర్గాల దాడి

గాంధారి, న్యూస్‌టుడే: భూవివాదంపై ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్న ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దుర్గానగర్ కాలనీలో ఎకరం స్థలం కొనుగోలు చేశారు. ప్రస్తుతం సదరు భూమి ఇతరుల కబ్జాలో ఉంది. భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు గురువారం ఓ గుత్తేదారుడికి అభివృద్ధి పనులు అప్పజెప్పారు. పనులు చేస్తుండగా కబ్జాలో ఉన్న వర్గం వారు అడ్డు వచ్చి దాడికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనపై 'న్యూస్‌టుడే' ఏఎస్సై గంగారాంను వివరణ కోరగా ..రెండు వర్గాల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

మిత్రుల ఆర్థిక చేయూత

బీబీపేట, న్యూస్‌టుడే: బీబీపేటకు చెందిన బాయికాడి నర్సింలు గుండెనొప్పితో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పదో తరగతి మిత్రులు తలా కొంత పోగు చేసి వైద్యుల ఖర్చుల నిమిత్తం రూ.60 వేల నగదును గురువారం అందజేశారు.

సాంకేతిక పరికరాల వితరణ



బాన్సువాడ, న్యూస్‌టుడే: పాతబాన్సువాడలోని చెమన్ ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎం రాజశేఖర్‌చౌదరి మిత్రులు గురువారం డిజిటల్ ప్రొజెక్టర్ పరికరాలను అందజేశారు. సత్యనారాయణమూర్తి, రెహమాన్, నాగేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, నరసింహారెడ్డి, కిష్టయ్య, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు.